ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 13 ఆగస్టు 2025

స్వేచ్ఛగా ఓటెత్తారు...

● స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్

● వైసీపీ కంచుకోటల్లో స్వేచ్ఛగా ఓట్లేసిన ఓటర్లు
● 81.53 శాతం పోలింగ్
● ఒంటిమిట్టలో హల్‌చల్ చేసిన ఉమ్మడి కడప జిల్లా వైసీపీ నేతలు
● వైసీపీ రిగ్గింగ్‌కు అడ్డుకట్ట వేసిన మంత్రి మండిపల్లి, చమర్తి
● చిన్నకొత్తపల్లె, సాలాబాదు, ఒంటిమిట్ట, మంటపంపల్లెలో టీడీపీ, వైసీపీ బాహాబాహీ
● మంటపంపల్లెలో కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలన
● అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ



సాలాబాద్ వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణులు బాహాబాహీకి దిగడంతో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాజంపేట/రాజంపేట టౌన్/ఒంటిమిట్ట/సిద్దవటం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గం కడప జిల్లా పరిధిలోని ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక పోలింగ్ చెదురుమదురు సంఘటనలో మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. వైసీపీకి కంచుకోట అయిన ప్రాంతాల్లో ఈసారి ప్రజలు స్వేచ్ఛగా ఓట్లేశారు. మంగళవారం ఉదయం నుంచే ఒంటిమిట్టలో ఎన్నికలు ప్రారంభమయ్యాయి. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 30 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు జరగగా ప్రధానంగా మండల కేంద్రమైన ఒంటిమిట్ట, చిన్నకొత్తపల్లె మంటపంపల్లె, సాలాబాదు పోలింగ్ కేంద్రాల్లో కొంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. టీడీపీ వైసీపీ వర్గాలు, నేతలు మోహరించడంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. వైసీపీకి చెందిన కడప ఉమ్మడి జిల్లా నేతలంతా ఒంటిమిట్టలో భారీ కాన్వాయ్‌తో మండల కేంద్రాల్లోని పోలింగ్ బూత్‌ల్లో హల్‌చల్ చేశారు. పెద్దఎత్తున అటు పోలీసులకు ఇటు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులతో వాగ్వాదంతో ముందుకు సాగారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఏకనిరంజన్‌గా మారి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి పోలింగ్‌ను సజావుగా జరిపించారు.

అన్నమయ్య, కడప జిల్లాలకు సంబంధించిన ఏ టీడీపీ నాయకులు లేకుండానే వీరిరువురే స్థానిక నేతలతో కలిసి వైసీపీని ఢీకొన్నారు. వైసీపీ నేతల ఆగడాలకు చెక్ పెడుతూ తమదైన రీతిలో ముందుకు సాగి వారి ఆధిపత్యాన్ని అడ్డుకున్నారు. అడుగడుగునా మంత్రిని వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. సాలాబాద్, ఒంటిమిట్టలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆది నుంచి వైసీపీకి అనుకూలంగా ఉండే మండలంలో వారి ఆధిపత్యానికి టీడీపీ అడ్డుకట్ట వేసింది. ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీకి చెందిన నాయకులు భారీ వాహనాల కాన్వాయ్‌తో వైసీపీ కార్యకర్తలను వెంటబెట్టుకుని పోలింగ్ బూత్‌ల వద్ద హల్‌చల్ చేసినా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చమర్తి జగన్‌మోహన్‌రాజు నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు వారి ఆగడాలకు చెక్ పెట్టి వైసీపీ రిగ్గింగ్‌కు పాల్పడకుండా అడ్డుకట్ట వేశారు. కొన్నిచోట్ల ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నేతృత్వంలో పోలీసు బలగాలు భారీగా చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు చర్యలు చేపట్టారు. 700 మంది పోలీసులు 30 పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగడకుండా ఎన్నికలు జరిగాయి. అయితే మంటపంపల్లె పోలింగ్ బూత్‌ల వద్ద ఏకపక్షంగా ఎన్నికలు జరిగాయని, బ్యాలెట్ కౌంటర్ స్లిప్పుల్లో ఏదో జరిగిందన్న ఆరోపణలపై స్వయంగా కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి ఎన్నికల అధికారులకు నివేదిక పంపారు.



ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు



గంగపేరూరులో పోలింగ్ బూత్‌ను పరిశీలించి వస్తున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

● ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లెలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వైసీపీ, టీడీపీ నేతలు బాహాబాహీకి దిగగా టీడీపీ వారిది పైచేయి అయ్యింది. ఈ సమయంలో పెళ్లికి వచ్చినట్లు సూటుబూటు వేసుకుని పోలింగ్ బూత్‌లోకి వచ్చిన ఓ నాయకుడిని ప్రత్యర్థి వారు బెదిరించారు. ఒకరికొకరు దాడులకు దిగడంతో సూటు, బూటు వేసుకుని ఎంతో హుషారుగా వచ్చిన ఓ నాయకుడు కాళ్లు నేలకు ఆనాయో లేదో అన్న స్పీడుతో అక్కడి నుంచి పరుగెత్తి ఉడాయించారు. ఆ తర్వాత ప్రయాణికుల బస్సు ఎక్కి దాక్కున్నాడు. అయినా ప్రత్యర్థి వర్గం వారు అతడిని వెంబడించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితితో పాటు ఆ నేత సూటుబూటుతో తీసిన పరుగు అందరిని కడుపుబ్బా నవ్వించింది.

● ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లె పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి దగ్గరకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెళ్లారు. ఇదేంది సుబ్బారెడ్డి ప్రశాంతంగా ప్రచారం చేసుకున్నాం, ఈ సమయంలో గొడవలు ఎందుకు, ఓటర్లను ఎందుకు బెదిరిస్తున్నావు, టీడీపీ నాయకులపై ఎందుకు దౌర్జన్యం చేస్తావు, మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలు చాలవా, ఇది పద్ధతి కాదు అని వారించారు. ఈ సమయంలో ఉద్రిక్తంగా ఉండడంతో అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను పిలిపించి అభ్యర్థి సుబ్బారెడ్డిని ఇబ్బంది లేకుండా పంపించి వేయండంటూ సమయస్ఫూర్తి ప్రదర్శించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పంపించి తన హుందాతనాన్ని కాపాడుకున్నారు. ఆ తర్వాత ఒంటిమిట్టకు చేరుకున్న వైసీపీ అభ్యర్థి సుబ్బారెడ్డి తన కేడర్‌ను, కడప జిల్లా వైసీపీ నేతలను పురమాయించి మంత్రి ఎక్కడికి వెళితే అక్కడికి పోయి చూసుకుందామంటూ వారిని రెచ్చగొట్టారు. కాగా నరసన్నగారిపల్లెలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డితో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఓటింగ్ సరళిని పరిశీలించారు.

● ఒంటిమిట్ట మండలం సాలాబాదులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇది వైసీపీ కంచుకోట. ఓట్లు వైసీపీకి ఏకపక్షంగా పడుతుండడంతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి అక్కడి పోలింగ్‌బూత్ వద్దకు వెళ్లారు. దీంతో వైసీపీ దూకుడుకు కళ్లెం పడింది.

● కడప నుంచి వైసీపీకి చెందిన మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి సుమారు 20 వాహనాల్లో కాన్వాయ్‌గా పోలింగ్ బూత్‌ల వద్ద తిరిగారు. ఈ సమయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎంతో సమయస్ఫూర్తిగా వ్యవహరించారు. ఎస్పీతో వాగ్వాదానికి దిగినా తనదైన శైలిలో ఇరువర్గాలను ఎటువంటి సంఘటనలు జరగకుండా ఇరువర్గాలను పంపించి వేశారు. ఇటు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని, అటు వైసీపీ నేతలను మధ్యాహ్నం పైనుంచి పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లకుండా సున్నితంగానే కట్టడి చేసి శభాష్ అనిపించుకున్నారు.



ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లెలో దాడులు జరగడంతో పరుగులు తీస్తున్న సూటు బూటు నేత



ఒంటిమిట్ట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి వెళుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న కడపకు చెందిన వైసీపీ నాయకులు

● పోలింగ్ బూత్‌ల వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కడపకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు వాగ్వాదానికి దిగారు. మంత్రిగా మీరు పోలింగ్ బూత్‌ల వద్దకు రావడం ఏమిటి, ఏకపక్షంగా ఎన్నికలు జరుపుకోవడం ఏమిటి, ఇదేమి పద్ధతి అని వారించారు.

ఇందుకు మంత్రి సమాధానం ఇస్తూ అధికారంలో ఉండగా జిల్లాలో ఒక్క ఎన్నికైనా జరగనిచ్చారా? జడ్పీటీసీ మండల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ వారిని ఒక్క నామినేషన్‌ను అయినా వేయించారా? దౌర్జన్యంగా ఏకపక్షంగా ఎన్నికలు జరుపుకున్న మీరూ ధర్మం, న్యాయం గురించి మాట్లాడితే ఎలా? ప్రజాస్వామ్యబద్ధంగా ఇప్పుడు ఎన్నికలు జరుగుతుంటే ఇంకా మీరే అధికారంలో ఉన్నట్లు మీరే వచ్చి దౌర్జన్యాలు చేస్తూ నీతి న్యాయం గురించి మాట్లాడటం వింతగా ఉందంటూ తనదైనశైలిలో సమాధానం ఇవ్వడం అక్కడి వారిని ఆలోచింపజేసింది.



81.53 శాతం పోలింగ్

ఒంటిమిట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ ఎన్నికలో మండలంలో మొత్తం 24,606 ఓట్లు ఉండగా 20,062 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 9755 మంది, మహిళలు 10,307 మంది ఉన్నారు. మొత్తం 81.53 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా 1వ బూత్‌లో 809 ఓట్లు ఉండగా 681 ఓట్లు పోలయ్యాయి. బూత్ నెంబర్-2లో 609 ఓట్లు ఉండగా 549 ఓట్లు పోలయ్యాయి. 3వ బూత్‌లో 626కు గాను 504 పోలయ్యాయి. 4వ బూత్‌లో 626 ఓట్లు ఉండగా 565 ఓట్లు, 5వ బూత్‌లో 518కి గాను 457 ఓట్లు, 6వ బూత్‌లో 646కు గాను 584 ఓట్లు, 7వ బూత్‌లో 796కు గాను 651 ఓట్లు, 8వ బూత్‌లో 920కి గాను 850 ఓట్లు, 9వ బూత్‌లో 920 ఓట్లు ఉండగా 781, 10వ బూత్‌లో 924 ఓట్లు ఉండగా 880, 11వ బూత్‌లో 996 ఓట్లు ఉండగా 802, 12వ బూత్‌లో వెయ్యి ఓట్లు ఉండగా 876 పోలయ్యాయి. 13వ బూత్‌లో 1002కు గాను 834, 14లో 1004 ఉండగా 900 ఓట్లు పోలయ్యాయి. 15వ బూత్‌లో 1004కు గాను 833, 16వ బూత్‌లో 912కు గాను 744, 17వ బూత్‌లో 912కు గాను 670 ఓట్లు పోలయ్యాయి. 18వ బూత్‌లో 912కు గాను 800, 19వ బూత్‌లో 915కు గాను 730, 20వ బూత్‌లో 743కు గాను 636, 21వ బూత్‌లో 1061కి గాను 508, 22వ బూత్‌లో 1122కు గాను 590 ఓట్లు పోలయ్యాయి. 23వ బూత్‌లో 506కు గాను 434, 24వ బూత్‌లో 543కు గాను 427, 25వ బూత్‌లో 735కు గాను 595, 26వ బూత్‌లో 736కు గాను 650, 27వ బూత్‌లో 460కి గాను 350, 28వ బూత్‌లో 460కి గాను 350, 29వ బూత్‌లో 899కి గాను 707 ఓట్లు, 30వ బూత్‌లో 898కి గాను 739 ఓట్లు పోలయ్యాయి.

ఒంటిమిట్ట, పులివెందులలో టీడీపీ విజయం ఖాయం

● వైసీపీ అరాచకాలను అడ్డుకున్నాం
● భారీ మెజారిటీతో గెలుపొంది తీరుతాం
● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కడప ఉమ్మడి జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత వాతావరణంలో జరిగాయని, వైసీపీ ఆగడాలకు ప్రజలు చరమగీతం పాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేశారని, ఈ రెండు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు భారీ విజయంతో గెలుపొందుతారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఒంటిమిట్టలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మండల, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీకి చెందిన వారిని కనీసం నామినేషన్లు కూడా వేయనివ్వకుండా ఏకపక్షంగా ఎన్నికలు జరుపుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించారన్నారు. వైసీపీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నామన్న విషయాన్ని మరచిపోయి ఈ రెండు స్థానాల్లో తిరిగి దౌర్జన్యాలు చేసి గెలుద్దామని కలలు కన్నారన్నారు. ఒంటిమిట్టలో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నాయకులంతా భారీగా వాహనాల్లో రౌడీలను, గూండాలను వెంటేసుకుని రిగ్గింగ్ చేసుకోవడానికి నానా అరాచకాలు సృష్టించారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం ఓటర్లను నిర్భయంగా ఓటు వేసుకోవడానికి భారీ భద్రత కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడంతో వైసీపీ దౌర్జన్యాలు ఒంటిమిట్టలో సాగలేదన్నారు. ఈ రెండు స్థానాల్లో టీడీపీ గెలిచి వైఎస్ జగన్ రాజకీయ పతనానికి ఆరంభం కాబోతున్నాయన్నారు. జగన్ రౌడీరాజ్యం ఇక సాగబోదని, కడప జిల్లా నుంచే అందునా పులివెందుల నుంచే ఆయన రాజకీయ పతనం మొదలవుతుందన్నారు. ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన నాయకులంతా ఒంటిమిట్టలో ఎన్నికల సందర్భంగా దౌర్జన్యాలకు పాల్పడి రిగ్గింగులకు దిగితే తాను జిల్లాకు చెందిన మంత్రిగా వారి ఆగడాలను అడ్డుకున్నానే తప్ప ఎటువంటి దౌర్జన్యాలకు దిగలేదన్నారు. వైసీపీ నేతల మాదిరిగా భారీగా వాహనాలతో రౌడీలు, గూండాలను వేసుకుని ఒంటిమిట్టకు తమ టీడీపీ నేతలు ఎవరూ రాలేదన్న విషయం వైసీపీ నేతలు గుర్తించుకోవాలని తెలిపారు.

జిల్లాలో ఇరువురికి కార్పొరేషన్ పదవులు

● జంగం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా చంద్రశేఖర్

కలికిరి/సంబేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జంగం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కలికిరికి చెందిన వాసునూరి చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. కలికిరి మండలం కొటాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ప్రస్తుతం రాజంపేట పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో బాగా వెనుకబడిన జంగం కులానికి ఎలాంటి గుర్తింపు లేని లోటు తీరిందని చంద్రశేఖర్ చెప్పారు. జంగం కుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు. కాగా నియామకానికి సంబంధించిన సమాచారం అందగానే ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆయన స్వంత పంచాయతీ పత్తేగడకు చంద్రశేఖర్ తండ్రి వాసునూరి రెడ్డెయ్య సర్పంచుగా పనిచేశారు.

రాష్ట్ర పాల ఏకిరి, ఏకిల కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు

రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలానికి చెందిన కందూరి నాగేశ్వర్‌నాయుడు బీసీ కోటాలో టీడీపీ తరపున రాష్ట్ర ఏకిరి, ఏకిల, వ్యాకుల, నాయునివారు, పాలెగారు, తోలగారి, కవళి సంక్షేమ, అభివృద్ధి సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, పార్టీ స్థాపించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉన్నట్టు తెలిపారు. 2013లో సంబేపల్లె సర్పంచ్‌గా 5 సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. టీడీపీలో జిల్లా కార్యదర్శిగా పనిచేసినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం బీసీలను ఏకం చేసి గెలుపునకు కృషి చేసినట్లు తెలిపారు. నా సేవలు గుర్తించి చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో పాల ఏకరి కులస్తుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలియజేశారు.



వాసునూరి చంద్రశేఖర్ కె.నాగేశ్వర్‌నాయుడు

మళ్లీ మొదటికే బొప్పాయి ధరలు

● చెక్‌పోస్టుల్లో ఉద్యాన, మార్కెటింగ్ శాఖల సిబ్బంది తనిఖీ
● టన్ను కాయలను రూ.7 వేలకు తగ్గించారంటూ ఆవేదన

6

స్వాతంత్ర్య వేడుకలను పండుగలా నిర్వహించాలి : కలెక్టర్

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నింపడమే లక్ష్యం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్
● హర్ ఘర్ తిరంగాలో భాగంగా బైక్ ర్యాలీ



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క భారతీయ పౌరుడు జాతీయ సమగ్రత, జాతీయ ఐక్యత చాటుకునే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని అందరిలో భారతదేశ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడమే లక్ష్యమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి బంగ్లా సర్కిల్ వరకు జిల్లా పర్యాటక శాఖ, ప్రభుత్వ వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా డివిజన్, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డీపీవో రాధమ్మ, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగభూషణం, జిల్లా అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్

రామాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రామాపురంలోని డంపింగ్ యార్డును మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. చెత్త సేకరణ రాష్ట్రవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని, చుట్టుపక్కల ఉన్న పొడి, తడి చెత్తలను వేరుగా చేయించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని పరిసరాల్లో సేకరించిన చెత్తను తప్పకుండా డంపింగ్ యార్డుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం నల్లగుట్టలపల్లి గ్రామంలోని హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. పూర్తి కాని గృహాలను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి జాషువా, హౌసింగ్ ఏఈ కేఎన్‌యం ప్రసాద్, స్థానిక పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్‌ఐ సమ్మద్‌ఖాన్, వీఆర్‌వో రాధిక, పెంచలయ్య, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవి



రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి

రాయచోటి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా జి.రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాయచోటి కమిషనర్‌గా పనిచేస్తున్న వాసుబాబు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో టీపీఆర్‌వోగా బదిలీ కావడంతో ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవిని రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. దీంతో ఆయన మంగళ వారం బాధ్యతలు చేపట్టారు.

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

● బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



భారీగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కులమతాలకతీతంగా అందరం కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని పుంగనూరు రోడ్డు మున్సిపల్ బోర్డు నుంచి చౌడేశ్వరి కల్యాణమండపం వరకు ఏడు కిలోమీటర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటానికి మదనపల్లెకు అవినాభావ సంబంధం ఉందని, ఎందరో సమరయోధులు మదనపల్లెలో పర్యటించారన్నారు. ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు మదనపల్లెలో మూడు రోజుల పాటు ముందస్తు స్వాతంత్ర్య సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మువ్వన్నెల జెండాలు కట్టిన బైక్ ర్యాలీ, రెండో రోజు వేలాది మహిళలతో కాలినడకన ర్యాలీ, మూడో రోజున అర్ధరాత్రి వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతిచెందిన రత్నమ్మ

నిమ్మనపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకొంది. ఏఎస్ఐ జిలానీబాషా వివరాల మేరకు కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారి పల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ భార్య మలిశెట్టి రత్నమ్మ(26) అనుమానాస్పదంగా మృతి చెందింది. మలిశెట్టి రత్నమ్మది బి.కొత్తకోట మండలం కాగా ఐదేళ్ల క్రితం జ్యోతిశేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకొన్నారు. వీరి ఇద్దరికీ రెండేళ్ల మునిష్కరనందన్ అనే కుమారుడు వున్నాడు. అయితే భర్త జ్యోతిశేఖర్ ప్రతి రోజు పెయింటంగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి రాగానే రత్నమ్మ ఇంటిలో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. రత్నమ్మ మృతిపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు అయన తెలిపారు.

ఏపీఎం రజనీకుమారిపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు


బ్యాంక్ వద్ద వాగ్వాదం చేసుకుంటున్న ఏపీఎం, మహిళలు

గుర్రంకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ సంఘమిత్ర-3 నాగరాజమ్మ తొలగింపు విషయమై మహిళలు ఏపీఎం రజనీకుమారితో గొడవపడి దాడి చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దాడికి సంబంధించి ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన నాగరాజమ్మ సంఘమిత్రగా పనిచేస్తుండేది. ఈ నేపథ్యంలో ఆమెపై ఆరోపణలు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఆమెకు సంఘమిత్ర విధులు చెప్పలేదు. ఈ నేపథ్యంలో నాగరాజమ్మ సంఘమిత్ర పరిధిలోని గ్రూప్ సభ్యులతో కలిసి మొదట వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీఎం రజనీకుమారి లేకపోవడంతో సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వద్దకు చేరుకొని ఏపీఎంతో మహిళలు వాగ్వాదం చేశారు. ఏపీఎంపై మహిళలు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనపై దాడి చేసిన నాగరాజమ్మ, భారతి, లక్ష్మీదేవి, రమణమ్మ, శేఖర్, గంగిరెడ్డిలపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాది పదవీ కాలంతో ఈ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడుగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడుగా ఎస్.ఎం.డి. షఫీ నాయక్, ఉపాధ్యక్షుడుగా సి.మల్లికార్జున, డైరెక్టర్లుగా కొర్లకుంట కృష్ణ, సోమవరపు కొండయ్య, మండెం సుజాత, బుక్కే కృష్ణా నాయక్, షేక్ మహ్మద్ రఫీ, బాలే కృష్ణమ్మ, మురికినాటి విజయలక్ష్మి, చీకటి హరిప్రసాద్, గుగ్గిలం మల్లికార్జున, ఆవుల వేదవతి, పురం రామాంజనేయులు, పందికుంట విజయలక్ష్మి, టి.సాలమ్మలతోపాటు రామాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ శాఖ ఏడీ, లక్కిరెడ్డిపల్లె సర్పంచు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా నామినేటెడ్ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి


విజయవాడలో ఉన్నత విద్యాశాఖ జేడీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థి జేఏసీ నేతలు ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణకు విన్నవించారు. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీని కలిసిన విద్యార్థి జేఏసీ నేతలు మాట్లాడుతూ బీసెంట్ ట్రస్టు నుంచి అనెగ్జర్-1 ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని, అప్పట్లో స్వాధీనం చేసుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఖర్చులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. యూజీసీ విధానాల ప్రకారం అధ్యాపకుల విద్యార్హతపై నిర్వహించిన విచారణ అనంతరం వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలన్నారు. కళాశాలలో పనిచేస్తున్న అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఉత్తన్న, టి.రాజా, సురేష్, శ్రావణ్, సుధీర్, శివ పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి: సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు దూరంగా వుండటంతో పాటు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు దగ్గర కాకపోవడం జీవితంలో పెద్ద విజయమని బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. డ్రగ్స్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. తాత్కాలిక తృప్తి కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని, బలహీన క్షణాలను అధిగమిస్తే జీవితం సుఖమయం అవుతుందని వివరించారు. సీఐతో పాటు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... వృద్ధురాలు మృతి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనచెరువు గ్రామం, టేకులపాలెంకు చెందిన పాపమ్మ(60) రైతుభరోసా డబ్బులు పడలేదని సచివాలయం వద్దకు ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో లాభాల గంగమ్మ ఆలయం సమీపంలో ఆటో బోల్తా పడింది. గాయపడిన వృద్ధురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

మళ్లీ మొదటికే బొప్పాయి ధరలు

● చెక్‌పోస్టుల్లో ఉద్యాన, మార్కెటింగ్ శాఖల సిబ్బంది తనిఖీ

● టన్ను కాయలను రూ.7వేలకు తగ్గించారంటూ ఆవేదన


చెక్‌పోస్టు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలు మళ్లీ మొదటికి వచ్చాయి. మంగళవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు బొప్పాయి రైతులు టన్ను కాయలను దళారులు రూ.7 వేలు చేశారని ఆవేదన చెందారు. బొప్పాయి రైతులు అందించిన సమాచారం మేరకు.... సీజన్ ప్రారంభంలో టన్ను కాయలు రూ.16 వేలు, తర్వాత టన్ను రూ.15 వేలు, రూ.14 వేలు, రూ.13వేలు, రూ.10వేలు ధరలు పలికాయి. ఉన్నపళంగా దళారులు టన్ను కాయలను రూ.7వేలు చేయడంతో గతంలో రైతులు భారీ ఎత్తున ఆందోళన చేశారు. వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫోన్ ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. రైల్వేకోడూరులోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో రైతులు, మార్వాడీలు, దళారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అయితే టన్ను కాయలను రూ.9 వేలకు తక్కువ లేకుండా చేయాలని కలెక్టర్ ప్రకటించారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. వ్యాపారం పెరిగే కొద్దీ ధరలు పెరుగుతూ ఉంటాయని తెలిపారు. ఈ నెల 1వ తేది నుంచి టన్ను కాయలను రూ.10 వేలు చేయాలని ఆదేశించారు. టన్ను 9 వేలు కాకుండా టన్ను రూ.8 వేలు చేశారని మళ్లీ రైతులు ఆందోళనకు దిగారు. రాజంపేటకు కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ భావన ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ధరల విషయంలో ఒక కొలిక్కి రాకపోవడంతో మళ్లీ సబ్ కలెక్టర్ రైల్వేకోడూరుకు రావాల్సి వచ్చింది. సమావేశం నిర్వహించి బొప్పాయి కాయలను టన్ను రూ.9 వేలకు ఎవరూ తగ్గించే ప్రసక్తి ఉండకూడదని దళారులకు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను ఎవరైనా పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ బొప్పాయి దళారులు టన్ను రూ.9 వేలు కాకుండా ఏకంగా ప్రస్తుతం టన్ను రూ.7 వేలు చేశారని రైతులు మళ్లీ ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు విన్నవించుకున్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కలిసి నియోజకవర్గంలోని చెక్‌పోస్టుల వద్ద లారీల తనిఖీలు చేపట్టారు. ఎవరైతే టన్ను కాయలను తక్కువగా కోతలు చేసి లోడింగ్ వేసుకుని వెళతారో వాటిని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళారులు అందరూ టన్ను బొప్పాయి కాయలను రూ.9 వేలకు తగ్గించి రైతులను మోసం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.


తహసీల్దార్ అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న బొప్పాయి రైతులు

స్వాతంత్ర్య వేడుకలను పండుగలా నిర్వహించాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న జరిగే 79వ భారత స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్వాతంత్ర్య వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకల్లో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులకు వేడుకలకు ప్రత్యేకంగా వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రొటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో షేమియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటరత్నం, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్


క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

రైల్వేకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులకు లాభదాయకమని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ బి.వెంకట మోహన్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలం బొజ్జావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులు క్షేత్ర స్థాయిలో పండిస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ గ్రామంలో ప్రకృతి పరంగా లభించే వేపాకులు, పశువుల ఎరువు తదితర వాటిని సేకరించుకుని పంటలకు వేస్తే అత్యధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. దీంతో భూసారం కూడా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఇన్‌పేషంట్ల వార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు

తంబళ్లపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె సబ్‌కలెక్టరు కళ్యాణి అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని బాలింతల వార్డు, ఇన్‌పేషంట్ల వార్డు, ఇంజక్షన్ల వార్డు, ఓపీ తదితర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రికి రోజూ వచ్చే ఓపీల సంఖ్య, ఇన్ పేషంట్ల వివరాలు, మందుల స్టాకు, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు తదితర వివరాలను వైద్యుడు అమర సింహరాజును అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత వేదిస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర సబ్‌కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టరు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో థామస్ రాజ, డీటీ నవీన్, ఎంఈవో త్యాగరాజు, ఆర్ఐ ముద్దుకృష్ణ, హెడ్‌నర్సు గ్లోరి, వీఆర్వో నాగరాజ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పీజీఆర్ఎస్ వినతులను పరిష్కరించాలి

ములకలచెరువు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి ఆదేశించారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ వినతుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, పెండింగ్‌లో ఉన్న వినతులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వీఆర్‌వోలతో సమావేశమై రెవెన్యూ సమస్యల గురించి ఆరా తీశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రియాజ్‌బేగ్

సంబేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ గుళిక తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంవో రియాజ్‌బేగ్ తెలియజేశారు. మంగళవారం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమవేశం ఏర్పాటు చేశారు. 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ నులిపురుగులను నివారించాలంటే గుళిక తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలు అందేలా చూడాలని అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బందికి తెలియజేశారు. భోజనానికి ముందు ప్రతిఒక్క విద్యార్థి చేతులు శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. రాయచోటి డైట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్‌లు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'టీ తాగుదాం' కార్యక్రమం


మాట్లాడుతున్న ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'టీ తాగుతూ చర్చించుకుందాం' కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ అరియర్స్, డీఏలను పట్టించుకోలేదని, మూడేళ్లుగా సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు అవసరం లేదంటూ మనమంతా కలిసి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే సుమారు 25 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రిటైరైన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక పోవడంతో వారు వివాహాది కార్యక్రమాలు చేసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాఖ రాష్ట్ర మహిళా కార్యదర్శి హైమావతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. కరీమ్, ఏపీజీఏ రాయచోటి తాలూకా అధ్యక్షుడు ఓ. సాయికుమార్, వాణిజ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మదనపల్లె అర్బన్ పరిధిలోని అమ్మచెరువు మిట్ట యుపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దస్త్రాలను పరిశీలించి వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాతా శిశువు సంరక్షణ సంబంధించిన మందులు ఉన్నాయా, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. రోజూ ఓపీకి వచ్చే రోగులకు ఈహెచ్‌ఆర్ తప్పక చేయాలన్నారు. అర్హులైన దంపతులకు కుటుంబ సంక్షేమంలో భాగంగా బిడ్డకు బిడ్డకు మధ్య సమయం ఉండేలా ప్రోత్సహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుజిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, అమ్మచెరువు మిట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ భార్గవి, హరికృష్ణ, ప్రసాద్, మహహ్మద్ రఫీ పాల్గొన్నారు.

బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీ


వైర్లను చూపుతున్న రైతు

గుర్రంకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామంలోని దిగువపల్లె వద్ద రైతుల పొలాల్లో బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన 18 మంది రైతుల బోర్ల వద్ద ఉన్న కేబుల్, స్టార్టర్‌లను దుండగులు కోసుకెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. కేబుల్ వైర్లు కత్తిరించడంతో రైతులు పొలాలకు నీరు అందించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం, నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు వెంకటేశ్ భార్య కృష్ణమ్మ(44) సోమవారం కుటుంబ కలహాలతో రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనం

రాజంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు పీర్‌మున్నీ ఒక ప్రకటనలో తెలిపారు. మందపల్లె గ్రామం సర్వే నంబరు 534లో కె.నరసయ్య 2.27 ఎకరాల భూమిని, కె.ఉమా 1.60 ఎకరాల భూమిని ఆక్రమించి సిమెంటు స్తంభాలు నాటగా వాటిని తొలగించామన్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మన్నూరు పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.


ప్రభుత్వ భూమిలో తొలగించిన సిమెంటు స్తంభాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న బయ్యారెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను విడదీశారని మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెకు చెందిన కొండారెడ్డి, సావిత్రమ్మ దంపతుల కుమారుడు బయ్యారెడ్డి (21) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండామరిపల్లెకు చెందిన ఓ యువతిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇరువురు మేజర్లు కావడంతో విషయం వారి కుటుంబ సభ్యులకు తెలిపి వివాహం చేయాలని కోరారు. కాగా పెద్దలు అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి వెళ్లి గురువారం కాణిపాకంలో వివాహం చేసుకున్నట్లు బాధితుడు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తాలుకా సీఐ కళా వెంకటరమణ తనకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని ఆదేశించారన్నారు. ఇరువురు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం సీఐ తమతో మాట్లాడుతూ యువతికి ఏడాదిలో చదువు పూర్తవుతుందని, అనంతరం పెద్దల సమక్షంలో పెళ్లి జరిపిస్తామని చెప్పి బలవంతంగా యువతిని ఆమె తల్లిదండ్రులతో సీఐ పంపి వేశారని బాధితుడు ఆరోపించారు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన బయ్యారెడ్డి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. ఎగువప్రాంతాల్లో, వర్షం వల్ల వాగులు, వంకల ద్వారా 2500 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరుతోందన్నారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,000 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ





వెల్లాల బ్రిడ్జిపై కంపవేసి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం దాదాపు 25వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కుందూకు వక్కిలేరు నీళ్లు జత కావడంతో టంగుటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు పడు తుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలి పారు. కాగా, వెల్లాల వద్ద బ్రిడ్జిపై నీళ్లు ప్రవహిస్తుండటంతో అక్కడ రాకపోకలను రెవెన్యూ అధికారులు కంప వేసి నిలిపివేశారు. గోపల్లె గ్రామాలకు వెళ్లే ప్రజలు ఎగువ ఉన్న కొత్త బ్రిడ్జిపై వెళ్లాలని సూచించారు. ఈ రాత్రికి వర్షం పడితే కుందూ మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది.

పెన్నాలో కొనసాగుతున్న వరద ఉధృతి

జమ్మలమడుగు వద్ద ప్రవహిస్తున్న వరదనీరు



జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత 10 రోజుల నుంచి వరద నీటితో పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెన్నానదిలోకి ఎవరు వెళ్లరాదని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే మంగళవారం రాత్రికి పెన్నానదికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, పెన్నానదిలో నీటి ప్రవాహంతో మైలవరం మండలంలోని వేపరాల గ్రామ శివార్లలో గనులకు వెళ్లే సిమెంటు రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇక నదిలో సుమారు రెండు మూడు చోట్ల కోతకు గురైందని తెలుస్తోంది.

రెండు జడ్పీటీసీలను గెలుస్తాం...

- చంద్రబాబు సాగిస్తున్న అభివృద్ధి-సంక్షేమంతోనే విజయం
- వైసీపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో ప్రజల ఆదరాభిమానాలతో రెండింటిలో గెలుపు ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సంధ్య సర్కిల్ సమీప మానస ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఉప ఎన్నికలలో ఓటర్లు టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టారని జోష్యం చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలను ఒక్కొక్కటిగా దిగ్విజయంగా ప్రజలకు అందజేస్తున్న నేపథ్యంలో ప్రజలు సైతం కూటమి పాలనకు జై కొట్టారన్నారు. ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలో తాను రౌడీయిజం చేసినట్లుగా కొంతమంది వైసీపీ నాయకులు ఆరోపించడం విడ్డూరంగా వుందన్నారు. వైసీపీ నాయకుల, రౌడీ మూకల కారణంగా ఒంటిమిట్టలో టీడీపీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అలాంటి సమయంలో టీడీపీ కార్యకర్తలకు ఆదుకోవాల్సిన బాధ్యత తనపై వుందన్నారు. అంతేకానీ తాను రాష్ట్ర మంత్రినని ఆలోచించే ప్రసక్తే లేదన్నారు. పైపెచ్చు తనకు ఒంటిమిట్టలో ఏమి పని అని కూడా వాఖ్యలు చేశారన్నారు. తాను పుట్టింది కడపలోనే అనే సంగతి వారు గుర్తెరగాలన్నారు. రాష్ట్రానికి మంత్రి అయినా ఉమ్మడి జిల్లాలో ఎప్పుడైనా ఎక్కడైనా తిరిగే హక్కు ఉందన్నారు. కాదు కూడదంటూ వైసీపీ నాయకులు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. వారం రోజులుగా ఒంటిమిట్టలో ఇంటింటికీ తిరిగి కూటమి పాలనలో ప్రజలకు ఏమి చేసింది, ఏమి చేయబోయేది వివరించామన్నారు. ప్రజలు బాగా అర్థం చేసుకున్నారని, వైసీపీ నేతలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసినా బెదరకుండా టీడీపీకే పట్టం కట్టబోతున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మునిసిపల్, జడ్పీటీసీ, పంచాయతీ తదితర అన్ని ఎన్నికలలో ప్రతిపక్షపార్టీని కనీసం నామినేషన్‌లు కూడా వేయించిన పాపాన పోలేదన్నారు. అలాంటిది ఇవాళ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందంటూ వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం వింతగా వుందన్నారు. ప్రజాస్వామ్యానికి విలువనిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఓటంటే ఎరుగని దాదాపు 30 గ్రామాల ప్రజలకు మొట్ట మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేశామన్నారు. వైసీపీ నాయకులు (రవిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అంజాద్‌బాష) ఒంటిమిట్టలో రౌడీయిజం ప్రదర్శిస్తూ వారి అనుచరులతో దొంగ ఓట్లు వేసేలా రిగ్గింగ్‌కు పాల్పడడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వారి ఆటలు ప్రజల ముందు సాగలేదన్నారు. కనుకనే రెండు జడ్పీటీసీలలో విజయం సాధించి ముఖ్యమంత్రి చంద్రన్నకు కానుకగా అందిస్తామన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో జైలు, జరిమానా



జైలు శిక్ష పడిన నిందితుడితో ఫారెస్టు అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న నేరం రుజువు కావడంతో మంగళవారం మద్దెల దేవదాసు అనే వ్యక్తికి తిరుపతిలోని ప్రత్యేక న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఫారెస్టు అధికారుల వివరాల మేరకు... ఖాజీపేట మండలంపత్తూరు హరిజనవాడకు చెందిన దేవదాసు 2011లో పత్తూరు సమీపంలో 71 ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో దేవదాసుకు ఏడాది జైలు శిక్షతోపాటురూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం స్పెషల్‌కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.రామానాయక్, ఫ్లయింగ్‌స్క్వాడ్ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ టి.రాజశేఖర్‌బాబు, ప్రొద్దుటూరు ఎఫ్‌ఆర్‌వో రామానాయక్ తెలిపారు.

భార్యపై భర్త ఫిర్యాదు

దువ్వూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన బాదుల్లా అనే వ్యక్తి తన భార్య బీబీపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ భూషణం తెలిపిన వివరాల మేరకు 13 ఏళ్ల క్రితం దొంతిపాడు మండలం బి.కొత్తపల్లెకు చెందిన బీబీతో బాదుల్లాకు వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. సదరు మహిళ ఇంటిలో ఒకటిన్నర లక్ష నగదుతోపాటు రెండు ఉంగరాలను తీసుకుని కనిపించకుండా పోయింది. గతంలో రెండుసార్లు ఇలాగే ప్రవర్తించింది. ఈ మేరకు భర్త బాదుల్లా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు మంగళవారం ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి మృతి



ప్రమాద స్థలంలో రమణయ్య మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె చెంచయ్యగారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సురసుర రమణయ్య (42) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రమణయ్య ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు-ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డు మొరాయిపల్లె గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి చాపాడు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన చిన్నబాలయ్య (40) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాలయ్య తమ్ముడు యేసు వివరాల మేరకు... తాళ్లప్రొద్దుటూరులో పనిచేసే ఓ హోంగార్డు వేధింపులకు తాళలేక జూలై 29న కడప జిల్లా కోర్టు ఎదురుగా పెట్రోలు పోసుకొని తన అన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డడని తెలిపాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. 14 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. బాలయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కేశవ

చెన్నూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కేశవ (40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరపల్లెకు చెందిన కేశవ వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో చెన్నూరుకు వచ్చి తిరిగి గ్రామానికి వెళుతున్నాడు. ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరిగే సమయంలో కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో కేశవ కాలు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందజేస్తున్న రాజలింగ శాస్త్రి కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీ మాత ఆలయ పునర్నిర్మాణానికి విజయవాడకు చెందిన వజ్రాల రాజలింగం శాస్త్రి కుటుంబ సభ్యులు రూ.5లక్షల చెక్కును అందజేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే విజయవాడ వాసి విశ్వకోట మార్కండేయులు కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు, విజయవాడ గవర్నరుపేట బ్రహ్మశ్రీ జవ్వాది కూర్మచార్యులు కుటుంబ సభ్యులు రూ.2లక్షలు అందించారు. అలాగే ధనాలకోట శోభన్‌బాబు కుటుంబ రూ.లక్షా 11వేలు చెక్కు అందజేశారు. క్రిష్ణా జిల్లా పెనమలూరు మండలం రత్నశేఖర్ కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు మఠాధిపతి వీరకుమార స్వామికి చెక్కును అందజేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



అవగాహన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్


కడప కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్‌వీ, ఎయిడ్స్ బారిన పడకుండా యువత అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ, ఏపీ శాక్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, మాదక ద్రవ్యాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతిపల్లెలో హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు, కండోమ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. నేటి తరం యువత క్షణికావేశంలో తమ బగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. జిల్లా ఎయిడ్స్ లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ పరీక్షలు ఉచితంగా అందించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉంటే నియంత్రణకు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. టీబీ వ్యాధి గ్రస్తుల జీవన శైలిలో మార్పుల కోసం సేవలందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, ఆర్‌ఆర్‌సీ కోఆర్డినేటర్ నాగరాజు, డాక్టర్ సావిత్రి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి




ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటరును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు ఇచ్చారు. రోగులకు ఆసుపత్రుల్లో అందించే సేవల ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఫీజులు ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆపరేషన్ థియేటర్లు, ప్రసవ గదులను పరిశీలించారు. పరిశుభ్రత పాటిస్తున్నారా, సరైన వైద్య సదుపాయాలు ఉన్నాయో లేవా అని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జయరాం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు, కళ్యాణ్ చక్రవర్తి, రమణారెడ్డి పాల్గొన్నారు.








సీతాకోకచిలుకా..

చూడముచ్చటగొల్పే రంగురంగుల సీతాకోకచిలుకలు పువ్వుల్లోని మకరందాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు అలరిస్తున్నాయి. కడప నగరంలోని అలంఖాన్‌పల్లె వేంకటేశ్వరస్వామి ఆలయం, గువ్వలచెరువు ఘాట్ సమీపంలో కనిపిస్తున్న ఈ దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతి రెక్కలోనూ నలుపు తెలుపు కన్నులు ఉన్నట్లున్న అందమైన సీతాకోకచిలుకలు చేస్తున్న నృత్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కడప

నిత్యపూజేశ్వరుడి సన్నిధిలో కడప సబ్‌డీఎఫ్‌వో



నిత్యపూజేశ్వరకోనలో పూజ చేస్తున్న కడప సబ్‌డీఎఫ్‌వో స్వామి వివేకానంద

సిద్దవటం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర ఆలయాన్ని కడప సబ్‌డీఎఫ్‌వో స్వామి వివేకానంద దర్శించుకున్నారు. ఆయనకు ఎండోమెంట్‌శాఖ సిబ్బంది ఘనంగా సత్కరించి ఆలయ విశిష్టతను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం తెలపాలని, కొండకు నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమని, వన్యప్రాణుల సంరక్షణపై ప్రతిఒక్కరు బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అదికారి కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎండోమెంట్ అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుల్లంపేటలో ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్

పుల్లంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు బుధవారం సబ్‌కలెక్టర్ భావన ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పుల్లారెడ్డి తెలిపారు. ఈ గ్రీవెన్స్‌లో మండలంలోని రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేవపట్ల సర్పంచ్‌కు నివాళులు

సంబేపల్లె, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి భౌతిక కాయానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు మంగళవారం నివాళులు అర్పించారు. దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలియడంతో ఆయన మంగళవారం సర్పంచ్ స్వగ్రామం ఆవులవాండ్లపల్లెకు వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడి ఓదార్చారు. వేణుగోపాల్‌రెడ్డి మృతి బాధాకరమని తెలియజేశారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ



విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎంఈవోలు

పుల్లంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దళవాయిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవోలు నాగతిరుమలరావు విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఉపాధ్యాయులు గ్రామస్థులతో కలిసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు గుర్తింపు కార్డులతో పాటు ప్యాకెట్ బ్యాడ్జ్ అందజేశారు. తల్లిదండ్రుల ఉపాధ్యాయుల కృషిని ఎంఈవోలు అభినందించారు.

అభివృద్ధికి మోకాలడ్డుతున్న ఆర్టీసీ..!

● నూతన బస్టాండు నిర్మాణానికి భూమిపూజ ● అధికారులు సహకరించక ముందుకు సాగని పనులు ● అభివృద్ధిపై పెదవివిరుస్తున్న స్థానికులు



రైల్వే కోడూరులోని ఆర్టీసీ బస్టాండ్



అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్నట్లుంది రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి. కోడూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి గెలిచి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండ్‌ను పునర్నిర్మిస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధ ప్రతిపదికన బస్టాండ్ నిర్మాణం కోసం కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి భూమి పూజ చేశారు. అయితే పనులు ప్రారంభం కాకముందే ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించి, పూర్తి స్థాయిలో సర్వే చేసిన తర్వాతే పనులు చేపడతామని తెలపడంతో పనులు ఆగిపోయాయి. గత ఏడాది జూన్ నెలలో ప్రారంభించగా, ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు సర్వే నిర్వహించకపోగా, కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం బస్టాండ్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గమనించిన దాతలు బస్టాండ్ ఆవరణలో కొన్ని నెలలు తాగునీటి సౌకర్యం కల్పించారు. కాగా, బస్టాండులో మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉండడంతో, ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ నేపథ్యంల బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు పలుమార్లు అధికారులను విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వే నిర్వహించి, నూతన బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోడూరు ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై రాజంపేట ఆర్టీసీ డీఎంను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



బస్టాండు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ముక్కా, అరవ శ్రీధర్

బస్టాండ్ పనులను వెంటనే ప్రారంభించాలి..



బస్టాండ్‌పనులు వెంటనే ప్రారంభించాలి. భూమి పూజ చేసి ఏడాది గడిచినా కనీసం పునాదులు కూడా వేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బస్టాండ్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండులో తాగు నీటి సౌకర్యం కల్పించాలి. పారిశుధ్యాన్ని పరిరక్షించాలి.

- రమణ, స్థానికుడు

ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత దూరం

పుల్లంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన రక్తహీనత రాకుండా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ తెలిపారు. మంగళవారంమండల కేంద్రంలోని సభహైస్కూల్ విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో అంగన్వాడీ సెంటర్‌లలో 7,025 మంది విద్యార్థులుండగా 6,837 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 20న మిగిలినవారికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. చిన్నారులు కిశోర బాలికల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, పౌష్టికాహార లోపం, నీరసంగా ఉండడం, మానసిక, శారీరక ఎదుగుదల లోపం ఉంటుందని వారికి ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తే నులిపురుగులు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట డాక్టర్ మనోజ్‌చంద్ర, సీహెచ్‌వో రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

సుండుపల్లె: సుండుపల్లెలో చిన్నపిల్లల వైద్యుడు దిలీప్‌గుప్త, రాయవరం వైద్యాధికారి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నులిపురుగు శరీరంలో ఉంటే కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, అలసట, రక్త హీనత ఏర్పడుతుందన్నారు. నులిపురుగుల నుంచి రక్షణ పొందాలంటే భోజనానికి ముందు, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలని, గోళ్లను కత్తరించుకోవాలని, శుభ్రమైన నీటిని తాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పర్వాఖానం, ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పుల్లంపేట: విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సానె శేఖర్

సిద్దవటం: సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యసిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీచేశారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ గట్టుపల్లె వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్త శారదా, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలో 8052 మంది విద్యార్థులు, చిన్నారులకు పెనగలూరు పీహెచ్‌సీ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో నగేష్, సూపర్‌వైజర్ మస్తాన్‌వల్లి, ఫార్మాసిస్టు మల్లికార్జున, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

అండర్-18 అథ్లెటిక్స్ విజేత ఆయేషా



ఆయేషాకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కళాశాల చైర్మన్

రాజంపేట టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ అథ్లెటిక్స్ అండర్-18 ఇంటర్ జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాజంపేట గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్‌బీ ఆయే షా విజేతగా నిలిచినట్లు ఆ కళాశాల చైర్మన్ ఎస్వీ రమణ తెలిపారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయన్నారు. వచ్చే నెలలో ఏపీ అథ్లెటిక్స్ పోటీల్లో ఆయేషా పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయేషాను ప్రోత్సాహక బహుమతితో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వినయ్ పాల్గొన్నారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం సాయంత్రం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పల్లంపాడు, కేసీపల్లె, ఎన్‌ఆర్ పురం గ్రామాల్లో 10 నిముషాలు భారీ వర్షం కురిసింది.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

కలకడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వయం అభ్యాస కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని డీఈఓ సుబ్రమణ్యం విద్యార్థులకు సూచించారు. మెగా టింకరింగ్ ల్యాబ్ సందర్భంగా బాటవారిపల్లె హైస్కూల్‌లో ఆయన మాట్లాడుతూ నిపుణుల ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ప్రాజెక్టులు రూపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. శాస్త్రీయ దృక్పథాలు, వై ఖరులు, అభివృద్ధిపై పట్టుసాధించేందుకు హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులుశేఖర్‌బాబు,లోకాజగనాథ్, బాబురెడ్డి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

పెద్దమండ్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పని చేయాలని మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆమె తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, మోడల్ స్కూల్, కాలేజీలను తనిఖీ చేసజణ ఆమె అధికారులతో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రీసర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అధికారులు, రైతు లతో రీసర్వే బృందాలు మాట్లాడి ఉమ్మడి సర్వే భూములు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరవాత పెద్దమం డ్యం ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగుల ఓపీ, సౌకర్యాలపై ఆరా తీశారు.

గ్రంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

నందలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో ఉన్న గ్రంథాలయంలో మంగళవారం ఉదయం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రవిశంకర్‌రాజు , మంటి మార య్య, రాజు, రవి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె డిప్యూటీ తహసీల్దారుగా సిద్దేశ్వర్



ఓబులవారిపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె డిప్యూటీ తహసీల్దారుగా సిద్దేశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో మండలంలోని సమస్యలపై అవగాహన కలిగి ఉంటారని రైతులు, గ్రామ స్థాయి నాయకులు భావిస్తు న్నారు.

నేడు నిత్యపూజేశ్వరాలయ హుండీ లెక్కింపు

సిద్దవటం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజేశ్వర ఆలయ హుండీలోని కానుకలను బుధవారం ఉదయం 10 గంటలకు స్వామివారి సన్నిధానంలో లెక్కించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు హాజరై సన్నిధానంలో భక్తులకు మెరుగైన వసతుల కోసం సలహాలు సూచనలు అందించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు,ఎన్జీవో సంఘం నేతలు

రాయచోటిటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమ స్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం నుంచి రావా ల్సిన బకాయిలను విడు దల చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌యంయూ) రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటి డిపో వద్ద ఎన్‌ఎంయూ, ఎన్జీవో సంఘం నేతలు సంయుక్తంగా గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే ఇవ్వాలని, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రె జరర్ దేవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్, డీఈసీ రామకృష్ణయాదవ్, ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరి, రీజనల్ గౌరవ సలహాదారు ఆర్‌వీ గోపాల్, రీజనల్ ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, రీజనల్ నాయకులు రామాంజులు, డిపో అధ్యక్షులు డీవీ సుబ్బయ్య డిపో కార్యదర్శి డీఎస్ వాసులు, గ్యారేజ్ కార్యదర్శి మెహరాజ్, అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.

రాజంపేట టౌన్: రాజంపేటలో డిపో కార్యదర్శి రమణ, తాలూకా ఏపీజేఏసీ చైర్మన్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించార

పీజీఆర్‌ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి



రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అమర్‌నాథ్

రైల్వేకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ సూచించారు. మంగళవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కారం చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పీజీఆర్‌ఎస్ విషయంలో జిల్లా అధికారులు సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. పని చేయని వీఆర్‌వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మానస, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గల్లా రమణ, ఆర్‌ఐ లక్ష్మీదేవి, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాల సాగుతో అధిక లాభాలు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

రామాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పప్పు ధాన్యాల సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం హసనాపురం పంచాయతీలోని కొండావాండ్లపల్లెకు చెందిన నాగేందర్‌రెడ్డి 10 ఎకరాల పొలంలో పప్పు ధాన్యాలు సాగు చేశారు. ఈ సందర్భంగా ఏవో నాగమణి మాట్లాడుతూ ఇలాంటి పంటల సాగుతో 365 రోజులు భూమి పచ్చగా కప్పబడి ఉంటుందన్నారు. వానపాములు అభివృద్ధి చెంది, భూమి సారవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీలు వెంకట్రామిరెడ్డి, సుధాకర్, ఖదీరున్నీసా, రెడ్డెమ్మ, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'సేవా రంగాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి'



తాగునీటి కేంద్రం ప్రారంభోత్సవంలో తహసీల్దారు స్పందన

చిట్వేలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సేవ చేయడం సామాజిక బాధ్యతగా మార్చుకోవాలని చిట్వేలి తహసీల్దారు స్పందన అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ (సీహెచ్‌ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం, ఉచిత మంచినీరు, వస్తు వితరణ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తహ సీల్దారు మాట్లాడుతూ సేవ చేయడమే మానవత్వం తలంపుతో సేవలు అందిస్తున్న సీహెచ్‌ఎస్ మానవత సేవాసంస్థ బాధ్యులు, సభ్యులు ఆదర్శ నీయులన్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఎస్ వ్యవస్థాపకుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విశేష దినాల్లో అన్నదానం చేయదలచినవారితోపాటు, పండుగలు, శుభ కార్యాల సందర్భంగా మిగిలిపోయిన ఆహారాన్ని అన్నార్తులకు అందించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఎస్ సభ్యులు శివారెడ్డి, తిరుమలరెడ్డి, మానవత సేవా సంస్థ చైర్మన్ సాయిరాం, కార్యదర్శి మునిరావు, సభ్యులు జానీ, సుధీర్‌రెడ్డి, పంచాయతి కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రంగారెడ్డి, పెంచలయ్య, బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటరెడ్డి, పంచాయతి సిబ్బంది నరసింహ, వెంకటేశ్, శివ, లక్ష్మీ, నాయుని వెంకటరమణ, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.


సీఐ విశ్వనాథరెడ్డి సేవలు మరువలేనివి



సీఐ విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి సేవలు మరువలేనివని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డికి ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో మంగళవారం పట్టణంలోని ఫయాజ్ కల్యాణ మండపంలో ట్రాఫిక్ పోలీసులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బందికి, పట్టణ ప్రజలకు, కృతజ్ఞతలు తెలియజేశారు. అర్బన్ సీఐ వెంకటచలపతి, రూరల్ సీఐ వరప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలి'



జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని దివ్యతేజ విద్యాసంస్థల్లో ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యతేజ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. విద్య కాషాయీకరణకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాయచోటి పట్టణ నాయకులు లోకేశ్, షబ్బీర్, నారాయణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతిచెందిన రత్నమ్మ

నిమ్మనపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకొంది. ఏఎస్ఐ జిలానీబాషా వివరాల మేరకు కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారి పల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ భార్య మలిశెట్టి రత్నమ్మ(26) అనుమానాస్పదంగా మృతి చెందింది. మలిశెట్టి రత్నమ్మది బి.కొత్తకోట మండలం కాగా ఐదేళ్ల క్రితం జ్యోతిశేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకొన్నారు. వీరి ఇద్దరికీ రెండేళ్ల మునిష్కరనందన్ అనే కుమారుడు వున్నాడు. అయితే భర్త జ్యోతిశేఖర్ ప్రతి రోజు పెయింటింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి రాగానే రత్నమ్మ ఇంటిలో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. రత్నమ్మ మృతిపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు అయన తెలిపారు.

ఏపీఎం రజనీకుమారిపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు



బ్యాంక్ వద్ద వాగ్వాదం చేసుకుంటున్న ఏపీఎం, మహిళలు

గుర్రంకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ సంఘమిత్ర-3 నాగరాజమ్మ తొలగింపు విషయమై మహిళలు ఏపీఎం రజనీకుమారితో గొడవపడి దాడి చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దాడికి సంబంధించి ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన నాగరాజమ్మ సంఘమిత్రగా పనిచేస్తుండేది. ఈ నేపథ్యంలో ఆమెపై ఆరోపణలు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఆమెకు సంఘమిత్ర విధులు చెప్పలేదు. ఈ నేపథ్యంలో నాగరాజమ్మ సంఘమిత్ర పరిధిలోని గ్రూప్ సభ్యులతో కలిసి మొదట వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీఎం రజనీకుమారి లేకపోవడంతో సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వద్దకు చేరుకొని ఏపీఎంతో మహిళలు వాగ్వాదం చేశారు. ఏపీఎంపై మహిళలు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనపై దాడి చేసిన నాగరాజమ్మ, భారతి, లక్ష్మీదేవి, రమణమ్మ, శేఖర్, గంగిరెడ్డిలపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాది పదవీ కాలంతో ఈ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడుగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడుగా ఎస్.ఎం.డి. షఫీ నాయక్, ఉపాధ్యక్షుడుగా సి.మల్లికార్జున, డైరెక్టర్లుగా కొర్లకుంట కృష్ణ, సోమవరపు కొండయ్య, మండెం సుజాత, బుక్కే కృష్ణా నాయక్, షేక్ మహ్మద్ రఫీ, బాలే కృష్ణమ్మ, మురికినాటి విజయలక్ష్మి, చీకటి హరిప్రసాద్, గుగ్గిలం మల్లికార్జున, ఆవుల వేదవతి, పురం రామాంజనేయులు, పందికుంట విజయలక్ష్మి, టి.సాలమ్మలతోపాటు రామాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ శాఖ ఏడీ, లక్కిరెడ్డిపల్లె సర్పంచు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా నామినేటెడ్ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



విజయవాడలో ఉన్నత విద్యాశాఖ జేడీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థి జేఏసీ నేతలు ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణకు విన్నవించారు. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీని కలిసిన విద్యార్థి జేఏసీ నేతలు మాట్లాడుతూ బీసెంట్ ట్రస్టు నుంచి అనెగ్జర్-1 ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని, అప్పట్లో స్వాధీనం చేసుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఖర్చులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. యూజీసీ విధానాల ప్రకారం అధ్యాపకుల విద్యార్హతపై నిర్వహించిన విచారణ అనంతరం వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలన్నారు. కళాశాలలో పనిచేస్తున్న అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఉత్తన్న, టి.రాజా, సురేష్, శ్రావణ్, సుధీర్, శివ పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు దూరంగా వుండటంతో పాటు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు దగ్గర కాకపోవడం జీవితంలో పెద్ద విజయమని బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. డ్రగ్స్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. తాత్కాలిక తృప్తి కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని, బలహీన క్షణాలను అధిగమిస్తే జీవితం సుఖమయం అవుతుందని వివరించారు. సీఐతో పాటు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... వృద్ధురాలు మృతి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనచెరువు గ్రామం, టేకులపాలెంకు చెందిన పాపమ్మ(60) రైతుభరోసా డబ్బులు పడలేదని సచివాలయం వద్దకు ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో లాభాల గంగమ్మ ఆలయం సమీపంలో ఆటో బోల్తా పడింది. గాయపడిన వృద్ధురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈమెకు ముగ్గురు కుమారైలు ఉన్నారు.

మళ్లీ మొదటికే బొప్పాయి ధరలు

● చెక్‌పోస్టుల్లో ఉద్యాన, మార్కెటింగ్ శాఖల సిబ్బంది తనిఖీ

● టన్ను కాయలను రూ.7వేలకు తగ్గించారంటూ ఆవేదన



చెక్‌పోస్టు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలు మళ్లీ మొదటికి వచ్చాయి. మంగళవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కొనేటి అమర్‌నాథ్‌కు బొప్పాయి రైతులు టన్ను కాయలను దళారులు రూ.7 వేలు చేశారని ఆవేదన చెందారు. బొప్పాయి రైతులు అందించిన సమాచారం మేరకు.... సీజన్ ప్రారంభంలో టన్ను కాయలు రూ.16 వేలు, తర్వాత టన్ను రూ.15 వేలు, రూ.14 వేలు, రూ.13వేలు, రూ.10వేలు ధరలు పలికాయి. ఉన్నపళంగా దళారులు టన్ను కాయలను రూ.7వేలు చేయడంతో గతంలో రైతులు భారీ ఎత్తున ఆందోళన చేశారు. వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫోన్ ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. రైల్వేకోడూరులోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో రైతులు, మార్వాడీలు, దళారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అయితే టన్ను కాయలను రూ.9 వేలకు తక్కువ లేకుండా చేయాలని కలెక్టర్ ప్రకటించారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. వ్యాపారం పెరిగే కొద్దీ ధరలు పెరుగుతూ ఉంటాయని తెలిపారు. ఈ నెల 1వ తేది నుంచి టన్ను కాయలను రూ.10 వేలు చేయాలని ఆదేశించారు. టన్ను 9 వేలు కాకుండా టన్ను రూ.8 వేలు చేశారని మళ్లీ రైతులు ఆందోళనకు దిగారు. రాజంపేటకు కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ భావన ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ధరల విషయంలో ఒక కొలిక్కి రాకపోవడంతో మళ్లీ సబ్ కలెక్టర్ రైల్వేకోడూరుకు రావాల్సి వచ్చింది. సమావేశం నిర్వహించి బొప్పాయి కాయలను టన్ను రూ.9 వేలకు ఎవరూ తగ్గించే ప్రసక్తి ఉండకూడదని దళారులకు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను ఎవరైనా పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ బొప్పాయి దళారులు టన్ను రూ.9 వేలు కాకుండా ఏకంగా ప్రస్తుతం టన్ను రూ.7 వేలు చేశారని రైతులు మళ్లీ ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు విన్నవించుకున్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కలిసి నియోజకవర్గంలోని చెక్‌పోస్టుల వద్ద లారీల తనిఖీలు చేపట్టారు. ఎవరైతే టన్ను కాయలను తక్కువగా కోతలు చేసి లోడింగ్ వేసుకుని వెళతారో వాటిని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళారులు అందరూ టన్ను బొప్పాయి కాయలను రూ.9 వేలకు తగ్గించి రైతులను మోసం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



తహసీల్దార్ అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న బొప్పాయి రైతులు

స్వాతంత్ర్య వేడుకలను పండుగలా నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న జరిగే 79వ భారత స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్వాతంత్ర్య వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకల్లో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులకు వేడుకలకు ప్రత్యేకంగా వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రొటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటరత్నం, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఇన్‌పేషంట్ల వార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు

తంబళ్లపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె సబ్‌కలెక్టరు కళ్యాణి అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని బాలింతల వార్డు, ఇన్‌పేషంట్ల వార్డు, ఇంజక్షన్ల వార్డు, ఓపీ తదితర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రికి రోజూ వచ్చే ఓపీల సంఖ్య, ఇన్ పేషంట్ల వివరాలు, మందుల స్టాకు, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు తదితర వివరాలను వైద్యుడు అమర సింహ రాజును అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత వేదిస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర సబ్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టరు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో థామస్ రాజ, డీటీ నవీన్, ఎంఈవో త్యాగరాజు, ఆర్ఐ ముద్దుకృష్ణ, హెడ్‌నర్సు గ్లోరి, వీఆర్వో నాగరాజ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పీజీఆర్ఎస్ వినతులను పరిష్కరించాలి

ములకలచెరువు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరిం చాలని మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి ఆదేశించారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ వినతుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, పెండింగ్‌లో ఉన్న వినతులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వీఆర్వోలతో సమావేశమై రెవెన్యూ సమస్యల గురించి ఆరా తీశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'టీ తాగుదాం' కార్యక్రమం



మాట్లాడుతున్న ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యో తి): 'టీ తాగుతూ చర్చించుకుం దాం' కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఏ) జి ల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయ చోటి పట్టణంలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ అరియర్స్, డీఏలను పట్టించుకోలేదని, మూడేళ్లుగా సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు అవసరం లేదంటూ మనమంతా కలిసి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే సుమారు 25 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమ స్యలను తెలుసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రిటైరైన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక పోవడంతో వారు వివాహాది కార్యక్రమాలు చేసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఈ విషయాలను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాఖ రాష్ట్ర మహిళా కార్యదర్శి హైమావతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. కరీమ్, ఏపీజీఏ రాయచోటి తాలూకా అధ్యక్షుడు ఓ. సాయికుమార్, వాణిజ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మదనపల్లె అర్బన్ పరిధిలోని అమ్మచెరువు మిట్ట యుపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దస్త్రాలను పరిశీలించి వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాతా శిశువు సంరక్షణ సంబంధించిన మందులు ఉన్నాయా, సీజనల్ వ్యాధుల పట్ల అవ గాహన కల్పించారు. రోజూ ఓపీకి వచ్చే రోగులకు ఈహెచ్‌ఆర్ తప్పక చేయాల న్నారు. అర్హులైన దంపతులకు కుటుంబ సంక్షేమంలో భాగంగా బిడ్డకు బిడ్డకు మధ్య సమయం ఉండేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుజిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, అమ్మచెరువు మిట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ భార్గవి, హరికృష్ణ, ప్రసాద్, మహహ్మద్ రఫీ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బయ్యారెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను విడదీశారని మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెకు చెందిన కొండారెడ్డి, సావిత్రమ్మ దంపతుల కుమారుడు బయ్యారెడ్డి (21) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండామరిపల్లెకు చెందిన ఓ యువతిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇరువురు మేజర్లు కావడంతో విషయం వారి కుటుంబ సభ్యులకు తెలిపి వివాహం చేయాలని కోరారు. కాగా పెద్దలు అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి వెళ్లి గురువారం కాణిపాకంలో వివాహం చేసుకున్నట్లు బాధితుడు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తాలుకా సీఐ కళా వెంకటరమణ తనకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని ఆదేశించారన్నారు. ఇరువురు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం సీఐ తమతో మాట్లాడుతూ యువతికి ఏడాదిలో చదువు పూర్తవుతుందని, అనం తరం పెద్దల సమక్షంలో పెళ్లి జరిపిస్తామని చెప్పి బలవంతంగా యువతిని ఆమె తల్లిదండ్రులతో సీఐ పంపి వేశారని బాధితుడు ఆరోపించారు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన బయ్యారెడ్డి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

రైల్వేకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులకు లాభదాయకమని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ బి.వెంకట మోహన్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలం బొజ్జావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులు క్షేత్ర స్థాయిలో పండిస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ గ్రామంలో ప్రకృతి పరంగా లభించే వేపాకులు, పశువుల ఎరువు తదితర వాటిని సేకరించుకుని పంటలకు వేస్తే అత్యధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. దీంతో భూసారం కూడా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రియాజ్‌బేగ్

సంబేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ గుళిక తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంవో రియాజ్‌బేగ్ తెలియజేశారు. మంగళవారం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ నులిపురుగులను నివారించాలంటే గుళిక తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలు అందేలా చూడాలని అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బందికి తెలియజేశారు. భోజనానికి ముందు ప్రతిఒక్క విద్యార్థి చేతులు శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. రాయచోటి డైట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్‌లు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీ



వైర్లను చూపుతున్న రైతు

గుర్రంకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామంలోని దిగువపల్లె వద్ద రైతుల పొలాల్లో బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. గ్రామా నికి చెందిన 18 మంది రైతుల బోర్ల వద్ద ఉన్న కేబుల్, స్టార్టర్‌లను దుండగులు కోసుకెళ్లి నట్లు రైతులు చెబుతున్నారు. కేబుల్ వైర్లు కత్తిరించడంతో రైతులు పొలాలకు నీరు అందిం చడానికి పడరాని పాట్లు పడుతున్నారు. అధికా రులు స్పందించి దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం, నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు వెంకటేశ్ భార్య కృష్ణమ్మ(44) సోమవారం కుటుంబ కలహాలతో రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనం

రాజంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు పీర్‌మున్నీ ఒక ప్రకటనలో తెలిపారు. మందపల్లె గ్రామం సర్వే నంబరు 534లో కె.నరసయ్య 2.27 ఎకరాల భూమిని, కె.ఉమా 1.60 ఎకరాల భూమిని ఆక్రమించి సిమెంటు స్తంభాలు నాటగా వాటిని తొలగించామన్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మన్నూరు పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



ప్రభుత్వ భూమిలో తొలగించిన సిమెంటు స్తంభాలు

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. ఎగువప్రాంతాల్లో, వర్షం వల్ల వాగులు, వంకల ద్వారా 2500 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరుతోందన్నారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,000 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ





వెల్లాల బ్రిడ్జిపై కంపవేసి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం దాదాపు 25వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కుందూకు వక్కిలేరు నీళ్లు జత కావడంతో టంగుటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు పడు తుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలి పారు. కాగా, వెల్లాల వద్ద బ్రిడ్జిపై నీళ్లు ప్రవహిస్తుండటంతో అక్కడ రాకపోకలను రెవెన్యూ అధికారులు కంప వేసి నిలిపివేశారు. గోపల్లె గ్రామాలకు వెళ్లే ప్రజలు ఎగువ ఉన్న కొత్త బ్రిడ్జిపై వెళ్లాలని సూచించారు. ఈ రాత్రికి వర్షం పడితే కుందూ మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది.

పెన్నాలో కొనసాగుతున్న వరద ఉధృతి

జమ్మలమడుగు వద్ద ప్రవహిస్తున్న వరదనీరు



జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత 10 రోజుల నుంచి వరద నీటితో పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెన్నానదిలోకి ఎవరు వెళ్లరాదని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే మంగళవారం రాత్రికి పెన్నానదికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, పెన్నానదిలో నీటి ప్రవాహంతో మైలవరం మండలంలోని వేపరాల గ్రామ శివార్లలో గనులకు వెళ్లే సిమెంటు రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇక నదిలో సుమారు రెండు మూడు చోట్ల కోతకు గురైందని తెలుస్తోంది.

రెండు జడ్పీటీసీలను గెలుస్తాం...

- చంద్రబాబు సాగిస్తున్న అభివృద్ధి-సంక్షేమంతోనే విజయం
- వైసీపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో ప్రజల ఆదరాభిమానాలతో రెండింటిలో గెలుపు ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సంధ్య సర్కిల్ సమీప మానస ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఉప ఎన్నికలలో ఓటర్లు టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టారని జోష్యం చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలను ఒక్కొక్కటిగా దిగ్విజయంగా ప్రజలకు అందజేస్తున్న నేపథ్యంలో ప్రజలు సైతం కూటమి పాలనకు జై కొట్టారన్నారు. ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలో తాను రౌడీయిజం చేసినట్లుగా కొంతమంది వైసీపీ నాయకులు ఆరోపించడం విడ్డూరంగా వుందన్నారు. వైసీపీ నాయకుల, రౌడీ మూకల కారణంగా ఒంటిమిట్టలో టీడీపీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అలాంటి సమయంలో టీడీపీ కార్యకర్తలకు ఆదుకోవాల్సిన బాధ్యత తనపై వుందన్నారు. అంతేకానీ తాను రాష్ట్ర మంత్రినని ఆలోచించే ప్రసక్తే లేదన్నారు. పైపెచ్చు తనకు ఒంటిమిట్టలో ఏమి పని అని కూడా వాఖ్యలు చేశారన్నారు. తాను పుట్టింది కడపలోనే అనే సంగతి వారు గుర్తెరగాలన్నారు. రాష్ట్రానికి మంత్రి అయినా ఉమ్మడి జిల్లాలో ఎప్పుడైనా ఎక్కడైనా తిరిగే హక్కు ఉందన్నారు. కాదు కూడదంటూ వైసీపీ నాయకులు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. వారం రోజులుగా ఒంటిమిట్టలో ఇంటింటికీ తిరిగి కూటమి పాలనలో ప్రజలకు ఏమి చేసింది, ఏమి చేయబోయేది వివరించామన్నారు. ప్రజలు బాగా అర్థం చేసుకున్నారని, వైసీపీ నేతలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసినా బెదరకుండా టీడీపీకే పట్టం కట్టబోతున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మునిసిపల్, జడ్పీటీసీ, పంచాయతీ తదితర అన్ని ఎన్నికలలో ప్రతిపక్షపార్టీని కనీసం నామినేషన్‌లు కూడా వేయించిన పాపాన పోలేదన్నారు. అలాంటిది ఇవాళ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందంటూ వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం వింతగా వుందన్నారు. ప్రజాస్వామ్యానికి విలువనిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఓటంటే ఎరుగని దాదాపు 30 గ్రామాల ప్రజలకు మొట్ట మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేశామన్నారు. వైసీపీ నాయకులు (రవిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అంజాద్‌బాషా) ఒంటిమిట్టలో రౌడీయిజం ప్రదర్శిస్తూ వారి అనుచరులతో దొంగ ఓట్లు వేసేలా రిగ్గింగ్‌కు పాల్పడడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వారి ఆటలు ప్రజల ముందు సాగలేదన్నారు. కనుకనే రెండు జడ్పీటీసీలలో విజయం సాధించి ముఖ్యమంత్రి చంద్రన్నకు కానుకగా అందిస్తామన్నారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందజేస్తున్న రాజలింగ శాస్త్రి కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీ మాత ఆలయ పునర్నిర్మాణానికి విజయవాడకు చెందిన వజ్రాల రాజలింగం శాస్త్రి కుటుంబ సభ్యులు రూ.5లక్షల చెక్కును అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే విజయవాడ వాసి విశ్వకోట మార్కండేయులు కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు, విజయవాడ గవర్నరుపేట బ్రహ్మశ్రీ జవ్వాది కూర్మచార్యులు కుటుంబ సభ్యులు రూ.2లక్షలు అందించారు. అలాగే ధనాలకోట శోభన్‌బాబు కుటుంబ రూ.లక్షా 11వేలు చెక్కు అందజేశారు. క్రిష్ణా జిల్లా పెనమలూరు మండలం రత్నశేఖర్ కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు మఠాధిపతి వీరకుమార స్వామికి చెక్కును అందజేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



అవగాహన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్

కడప కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్‌వీ, ఎయిడ్స్ బారిన పడకుండా యువత అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ, ఏపీ శాక్స్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం పురష్కరించుకొని హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, మాదక ద్రవ్యాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతిపల్లెలో హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు, కండోమ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. నేటి తరం యువత క్షణికావేశంలో తమ బగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ పరీక్షలు ఉచితంగా అందించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉంటే నియంత్రణకు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. టీబీ వ్యాధిగ్రస్తుల జీవన శైలిలో మార్పుల కోసం సేవలందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాద్, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ నాగరాజు, డాక్టర్ సావిత్రి, ఎన్ఎస్ఎస్ ఆఫీసరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో జైలు, జరిమానా



జైలు శిక్ష పడిన నిందితుడితో ఫారెస్టు అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న నేరం రుజువు కావడంతో మంగళవారం మద్దెల దేవదాసు అనే వ్యక్తికి తిరుపతిలోని ప్రత్యేక న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఫారెస్టు అధికారుల వివరాల మేరకు... ఖాజీపేట మండలంపత్తూరు హరిజనవాడకు చెందిన దేవదాసు 2011లో పత్తూరు సమీపంలో 71 ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో దేవదాసుకు ఏడాది జైలు శిక్షతోపాటురూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం స్పెషల్‌కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.రామానాయక్, ఫ్లయింగ్‌స్క్వాడ్ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ టి.రాజశేఖర్‌బాబు, ప్రొద్దుటూరు ఎఫ్ఆర్‌వో రామానాయక్ తెలిపారు.

భార్యపై భర్త ఫిర్యాదు

దువ్వూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన బాదుల్లా అనే వ్యక్తి తన భార్య బీబీపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ భూషణం తెలిపిన వివరాల మేరకు 13 ఏళ్ల క్రితం దొంతిపాడు మండలం బి.కొత్తపల్లెకు చెందిన బీబీతో బాదుల్లాకు వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. సదరు మహిళ ఇంటిలో ఒకటిన్నర లక్ష నగదుతోపాటు రెండు ఉంగరాలను తీసుకుని కనిపించకుండా పోయింది. గతంలో రెండుసార్లు ఇలాగే ప్రవర్తించింది. ఈ మేరకు భర్త బాదుల్లా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు మంగళవారం ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి మృతి



ప్రమాద స్థలంలో రమణయ్య మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె చెంచయ్యగారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సురసుర రమణయ్య (42) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రమణయ్య ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు-ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డు మొరాయిపల్లె గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి చాపాడు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన చిన్నబాలయ్య (40) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాలయ్య తమ్ముడు యేసు వివరాల మేరకు... తాళ్లప్రొద్దుటూరులో పనిచేసే ఓ హోంగార్డు వేధింపులకు తాళలేక జూలై 29న కడప జిల్లా కోర్టు ఎదురుగా పెట్రోలు పోసుకొని తన అన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డడని తెలిపాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. 14 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. బాలయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కేశవ

చెన్నూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కేశవ (40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరపల్లెకు చెందిన కేశవ వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో చెన్నూరుకు వచ్చి తిరిగి గ్రామానికి వెళుతున్నాడు. ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరిగే సమయంలో కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో కేశవ కాలు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో సాగిన ఎన్నికను అపహాస్యం చేస్తారా..? : ఎమ్మెల్సీ


పులివెందుల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా సాగినా అపహాస్యంచేస్తారా అని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని అరెస్టు చేసి విడుదల చేసిన అనంతరం ఆయన మాటాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పులివెందుల ప్రజలు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు సాగితే వైసీపీ నాయకులు దీనిని అపహాస్యం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి ఎన్నికలకు ఎటువంటి సంబంధంలేదన్నారు. కేవలం ఎన్నికల కమిషన్ పరిధిలో సాగుతాయన్నారు. పులివెందులలో ఇలాంటి ఎన్నికలు జరగడం వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి



ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటరును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు ఇచ్చారు. రోగులకు ఆసుపత్రుల్లో అందించే సేవల ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఫీజులు ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆపరేషన్ థియేటర్లు, ప్రసవ గదులను పరిశీలించారు. పరిశుభ్రత పాటిస్తున్నారా, సరైన వైద్య సదుపాయాలు ఉన్నాయో లేవా అని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జయరాం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు, కళ్యాణ్ చక్రవర్తి, రమణారెడ్డి పాల్గొన్నారు.





సీతాకోకచిలుకా..

చూడముచ్చటగొల్పే రంగురంగుల సీతాకోకచిలుకలు పువ్వుల్లోని మకరందాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు అలరిస్తున్నాయి. కడప నగరంలోని అలంఖాన్‌పల్లె వేంకటేశ్వరస్వామి ఆలయం, గువ్వలచెరువు ఘాట్ సమీపంలో కనిపిస్తున్న ఈ దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతి రెక్కలోనూ నలుపు తెలుపు కన్నులు ఉన్నట్లున్న అందమైన సీతాకోకచిలుకలు చేస్తున్న నృత్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కడప



నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ప్రతి పాఠశాలలోనూ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ● డీవార్మింగ్ డేలో విద్య, వైద్యసిబ్బంది



పీలేరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు, ఉపాధ్యాయులు - పెద్దపొంగుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో... - ములకలచెరువులో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి రేష్మాబేగం

పీలేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పిల్లల శరీరంలోని పేగుల్లో చేరిన నులిపురుగులకు ఒక ఆల్‌బెండజోజ్ మాత్రతో చెక్ పెట్టవచ్చని రేగళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, తలపుల అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల కడుపులో నులి పురుగులు ఉంటే రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పివంటి ఇబ్బందులు కలుగుతాయన్నారు. నులిపురుగులను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. చిన్న వయస్సులోనే నులి పురుగులను నివారిస్తే వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించారు. రేగళ్ల, తలపుల పీహెచ్‌సీల సిబ్బంది తమ పరిధిలోని చిన్నారులకు మధ్యాహ్న భోజన సమయంలో ఆల్బెండజోల్-400 మాత్రలు అందించారు. మండలంలో 21,111 మంది 19 ఏళ్లలోపు వారు ఉండగా 20,349 మందికి(96 శాతం) మాత్రలు అందించారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్యారూఖాన్, ఉపాధ్యాయులు జైపాల్ రెడ్డి, శ్రీరాములు, భాస్కర్, రాజేశ్వరి, హెచ్‌ఈలు కొండయ్య, కృష్ణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఫామున్నిసా, ద్రాక్షాయణి, శివప్రసాద్, మనోహర్, సుస్మిత, ఆశా కార్యకర్తలు రేణుక, వీరా కుమారి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకే డీవార్మింగ్

వాల్మీకిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకే నులిపురుగుల నివారణ నిర్వహిస్తారని జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం గండబోయనపల్లె జడ్పీ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేసి ప్రారంభించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత దూరం

కలకడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతో పిల్లల్లో రక్తహీనత దూరమవుతుందని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. జాతీయ డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. సిబ్బంది రెడ్డెప్ప, సుబ్బరత్న, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆరోగ్యం మెరుగు

గుర్రంకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా బాలికల గురుకుల విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పీటీఎం పీహెచ్‌సీ డాక్టర్ మహ్మద్ ఎస్తానీ స్థానిక వైద్య సిబ్బందితో కలిసి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 952 మంది విద్యార్థులకు, 573 మంది అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నివారణ

తంబళ్లపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రలు తినడం వలన నులి పురుగులను నివారించవచ్చని సీడీపీఓ సుజాత అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

ములకలచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నియంత్రణతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు మింగించిన ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణిస్తారన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు మింగించామన్నారు. మొత్తం 6754 మంది విద్యార్థులకు 6532 మందికి మాత్రలు మింగించామన్నారు. కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది, ఎన్ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

పెద్దమండ్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పని చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆమె తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, మోడల్ స్కూల్, కాలేజీలను తనిఖీ చేసజణ ఆమె అధికారులతో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రీసర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అధికారులు, రైతులతో రీసర్వే బృందాలు మాట్లాడి ఉమ్మడి సర్వే భూములు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూములు భాగ పరిష్కారాలు, ప్రభుత్వ భూములు, పట్టా భూములు పలు అంశాలు పరిశీలించి పక్కాగా సర్వే చేయాలన్నారు. మ్యుటేషన్‌లో వివరాలు రైతులకు సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగాలన్నారు. తరవాత పెద్దమండ్యం ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగుల ఓపీ, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మోడల్ స్కూల్‌లో ఇంటర్ తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. తహసీల్దార్ తేజశ్వి, పీహెచ్‌సీ డాక్టర్ అశోక్, అయూస్ డాక్టర్ మహబూబ్‌బాష, ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, టీడీ రాజేష్‌కుమార్, మండల ఆర్ఐ భరత్, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి


ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో కార్యాలయం వద్ద ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పీలేరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని ఎన్ఎంయూ రీజనల్ కార్యదర్శి పీ.ఎస్. ఎం రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీలేరు ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి వందల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, అయితే వీటిని ఉద్యోగ సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా ప్రభుత్వం బడా కంపెనీలకు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీనే నిర్వహించాలన్నారు. పెండింగ్ ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని సూచించారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీ.వీ. రమణ, జీ. ఆదినారాయణ, రీజనల్ నేతలు వీపీ. నాయుడు, టీ. మధుసూదన్, బీ.ఆర్.బీ. నాయక్, ఎం. హెచ్ నాయుడు, డిపో నేతలు సునీల్, యల్లయ్య, చిన్నమల్లు, రామయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

నిమ్మనపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని ఏఓ మంజులు పేర్కొన్నారు. వెంగంవారిపల్లి పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ వరి నాట్లలో పైరును సాలుకు నాటితే వరి పైరుకు ఎండ. గాలి బాగాసోకి మంచి దిగుబడి వస్తుందన్నారు. కలుపు తీసేందుకు, యూరియా వేసేందుకు అనువుగా వుంటుదన్నారు. అనంతరం పంటలు పండిచిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌ను తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు.

స్వమిత్రపై ప్రజలకు అవగాహన కల్పించాలి



స్వమిత్రపై శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

మదనపల్లె టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న స్వమిత్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీఓ నాగరాజు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్‌లోని ఐదు మండలాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి స్వమిత్రపై ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఉపయోగాలు వుంటాయి, గ్రామ కంఠంలోని భూములను ఎలా విక్రయించాలి, ఎలా రుణాలు పొందాలో స్వమిత్ర పథకంలో వర్తిస్తాయన్నారు. దీనిపై ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ కలసి 50 ఇళ్ల చొప్పున సర్వే చేసి, ఈనెలాఖరులోగా స్వమిత్వ సర్వే పూర్తి చేయాలన్నారు. స్వర్ణగ్రామ పంచాయతీ యాప్‌లో గ్రామాల్లో ఇళ్ల కొలతలు తీసుకుని, ఇంటి పన్ను నిర్ణయించి ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ అమరనాథ్, బయ్యారెడ్డి, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, డీఏలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

కలకడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వయం అభ్యాస కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని డీఈఓ సుబ్రమణ్యం విద్యార్థులకు సూచించారు. మెగా టింకరింగ్ ల్యాబ్ సందర్భంగా బాటవారిపల్లె హైస్కూల్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. నిపుణుల ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ప్రాజెక్టులు రూపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. శాస్త్రీయ దృక్పథాలు, వైఖరులు, అభివృద్ధిపై పట్టుసాధించేందుకు విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టూడెంట్ అసైన్‌మెంట్ బుక్‌ను పరిశీలించి నిర్వాహణపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులచేత డీవార్మింగ్ మాత్రలను మింగించారు. హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, లోకాజగనాథ్, బాబురెడ్డి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 61 మంది ఎంపిక

పీలేరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 61 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలి పారు. మంగళవారం సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 12 కంపెనీల ప్రతి నిధులు పాల్గొన్నారు. 120 మంది ఇంటర్వ్యూలకు హాజరవగా వివిధ కంపెనీలకు 61 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ ఆరీఫ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ వెంకటేష్, కంపెనీలు ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్‌కు సన్మానం



అమానుల్లాను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పీలేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పీలేరు సింగిల్ విండో డైరెక్టరు అమానుల్లాను మంగళవారం పలువురు టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. పీలేరు ఏఎంసీ డైరెక్టర్లు గోళ్ల కిశోర్ నాయుడు, లక్ష్మీకాంతమ్మ, షమ, చంద్రలేఖ మాట్లాడుతూ కష్టపడిన వారికి టీడీపీలో గుర్తింపు ఉంటుందనడానికి అమానుల్లా ఒక ఉదాహరణ అన్నారు. నేతలు శివరామాపురం నౌషాద్, కేజీఎన్ రెడ్డిబాషా, అల్లాబకష్, సయ్యద్ బాషా, మస్తాన్ బాబు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



ప్లకార్డులతో విద్యార్థులు వైద్య సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో మీకుతెలుసా ఐఈసీ హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరమేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి, కౌన్సిలర్ లోకేష్, సిబ్బంది శ్రీలక్ష్మి, శ్వేత, లత, తదితరులు పాల్గొన్నారు.

'మీకు తెలుసా' పోస్టర్ల ఆవిష్కరణ

తంబళ్లపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ సూచించారు. మంగళవారం ఐసీటీసీ, ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన మండలి ఆధ్వర్యంలో కృషి సంస్థ సహకారంతో తంబళ్లపల్లెలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన చేపట్టారు. ఎంపీడీఓ థామస్ రాజా ద్వారా 'మీకు తెలుసా' పోస్టర్లను ఆవిష్కరించారు. ఎల్‌టీ బాలాజి, వెలుగు సీసీలు రమణ, నరసింహులు, సంస్థ మేనేజరు శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యూ సావిత్రి, పల్లవి, పీఈ శోభ పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



(ఆంధ్రజ్యోతి, బి.కొత్తకోట)

రహదారిపై వర్షపు నీటి సాక్షిగా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పీటీఎం రోడ్డులోని తారు రోడ్డు గుంతల మయమై అధ్వానంగా తయారైంది. షాదీమహల్ వద్ద పరిస్థితి దారుణంగా తయారైంది. జడ్పీహైస్కూల్ నుంచి వర్షపు నీరంతా రోడ్డు వెంబడి వెళ్లి షాదీమహల్ రోడ్డుపై నిలుస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ద్విచక్రవాహనాలు సగం వరకు ఈ నీటిలో మునిగి వెళ్లాల్సివస్తోంది. వాహనాలు అదుపు తప్పితే అంతేగతి. ఏళ్ల తరబడి ఈ సమస్య వున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కార మార్గం చూపలేకున్నారు. మహిళలైతే వాహనం దిగి మరీ ఇబ్బందిగా వెళ్లాల్సిన దుస్థితి. స్కూటీలపై వచ్చే మహిళలు ఇతరుల సాయంతో అవతలి వైపునకు చేరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై నీటిగుంటను లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'దొంగ ఓట్ల మోదీ గద్దె దిగాలి'

మదనపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోదీ వెంటనే రాజీనామా చేయాలని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక బాస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ బయటపెట్టిన ఓట్ల దొంగతనం మీద సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలన్నారు. దొంగ ఓట్లను సృష్టించడంతో బీజేపీ, ఎలక్షన్ కమిషన్ ప్రమేయం పట్ల అనుమానాలు ఉన్నాయని, ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న అధికారులను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ జరపాలన్నారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ నేతలు గంగులప్ప, గంగాధర్, సయ్యద్‌బాష పాల్గొన్నారు.

'రాహుల్ ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పాలి'

పీలేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అవకతవకలు, అక్రమాలపై రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికల్లో జరగనున్న అక్రమాలను కాంగ్రెస్ పార్టీ ముందుగానే వెల్లడించిందని, బీహార్‌లో జరిగిన అవకతవకలపై కోర్టు మొట్టికాయలు వేసినా ఈసీ పట్టించు కోకపోవడం శోచనీయమన్నారు.

ఉచిత విద్యుత్‌పై హర్షం

మదనపల్లె టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడంపై నాయీబ్రాహ్మణుల సాధికార సమితి నేతలు హర్షం ప్రకటించారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద నాయీబ్రాహ్మణ సాధికార సమితి సభ్యుడు ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ సెలూన్‌లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రకటించడం ఆనందంగా వుందన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం కేశవులు, మంజునాథ్, ఈశ్వర్, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీతరగానిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ పావని

రామసముద్రం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సీతరగానిపల్లెలో మంగళవారం పశువైద్యాధికారి పావని ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. బుటాక్ స్ప్రే 175 దూడలకు, నట్టల నివారణ 46 పశువులకు, గర్భకోశ వ్యాధులు 29, ప్రథమ చికిత్స 9 పశువులకు చేసినట్లు ఆమె తెలిపారు. ముద్ద చర్మం వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పశువైద్యులు సలహాలు తీసుకోవాలన్నారు. జేఈఓ భాను ప్రకాష్, ఎల్‌పి దత్తాత్రేయ, ఏహెచ్‌ఎల్ నరేష్, రవి, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై నడుం బిగించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనపై నడుం బిగించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కోటేశ్వరితో కలిసి రోగులకు అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో జయకుమార్, మహమ్మద్‌బాష, పురుషోత్తం, ఆర్ఆర్ఎస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జన్మాష్టమి పోస్టర్ ఆవిష్కరణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అనపగుట్టలోని గోవర్ధన్‌గిరిలో ఉన్న శ్రీకృష్ణాఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 16న శ్రీకృష్ణ ఆలయంలో జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తునట్లు తెలిపారు.

రమ్యంగా శ్రీ కృష్ణతులాభారం

నిమ్మనపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బాలినాయునిపల్లిలో నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత యజ్ఞం ద్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం పగలు శ్రీ కృష్ణ తులాభారం, రాత్రి ఉత్తర గోగ్రహణం నాటకాలు కథకురాలు కౌసల్య ఆలపించారు. 14న ధర్మరాజు పట్టాభిషేకం జరుగుతుందన్నారు.

జిల్లా కార్యవర్గసభ్యుడిగా వెంకటేశ్ నియామకం



పీలేరు, ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో రెండోసారి జిల్లా కార్యవర్గసభ్యుడిగా నియమించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కలకడ సీఐగా లక్ష్మన్న



కలకడ, ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): కలకడ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.లక్ష్మన్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ములకలచెరువు నుంచి బదిలీపై కలకడకు వచ్చారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

సీట్లకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వసతి, విద్యా బోధన అందిస్తున్నారన్నారు. 5వ తరగతిలో అన్ని గ్రేడ్లలో కలిపి 23 సీట్లు, టెన్త్‌లో ఏడు సీట్లు, ఇంటర్‌లో 8 సీట్లు ఖాళీ వున్నాయన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ఎన్టీయూ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, కడప- బెంగళూరు రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని, హార్సిలీహిల్స్‌పై అంగుళం స్థలం కూడా రాందేవ్‌బాబాకు ఇవ్వరాదన్నారు. బీటీ కళాశాల ఆస్తులను పరిరక్షించాలని, చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు పూర్తి చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లె- నిమ్మనపల్లె, మదనపల్లె- రామసముద్రం డబుల్ రోడ్ల ఏర్పాట్లపై ఎన్నికల హామీలను గుర్తు చేశారు. మదనపల్లెలో అక్రమాలకు అడ్డులేదన్నారు. ఇసుక, మట్టి మాఫియా నడుస్తోందని ఆరోపించారు.